క్లుప్తంగా

పంచారామ క్షేత్రంలో భక్తుల రద్దీ



సామర్లకోట పంచారామ క్షేత్రంలో ప్రత్యేక అలంకరణలో స్వామివారు

సామర్లకోట: స్థానిక పంచారామ క్షేత్రం బాలా త్రిపుర సుందరీ సమేత కుమారారామ భీమేశ్వరస్వామి ఆలయం సోమవారం భక్తులతో కిటకిటలాడింది. స్వామివారికి ప్రీతికరమైన రోజు కావడంతో పాటు నూతన సంవత్సరం సందర్భంగా అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చారు. తెల్లవారు జామున స్వామివారికి జరిగే తొలి అభిషేకం, పూజలను తిలకించడానికి బారులు తీరారు. ఈఓ డి.నాగమల్లేశ్వరరావు ఆధ్వర్యంలో ఆలయ పండితులు తెల్లవారు జామున పిఠాపురం మహారాజా గోత్రనామాలతో పూజలు చేశారు. స్వామి, అమ్మవార్లకు ఆలయంలోని ఉప ఆలయాలు, మూలవిరాట్‌లకు ప్రత్యేక పూజలు జరిగాయి. పూజల అనంతరం సాయంత్రం స్వామి, అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయానికి వచ్చిన భక్తులకు దేవస్థానంలోని అన్నదాన ట్రస్టు ఆధ్వర్యంలో భోజన ఏర్పాట్లు చేశారు. ఆలయ పండితులు వేమూరి సోమేశ్వరశర్మ, సన్నిదిరాజు వెంకన్న, చెరుకూరి రాంబాబు, శ్రీకాకుళపు సత్యనారాయణమూర్తి, వినయ్‌లు పూజా కార్యక్రమాలు చేపట్టారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు



గాయపడిన యువకుడు చిన్న

పెద్దాపురం: ఆటో బోల్తా పడిన సంఘటనలో ఓ యువకుడు తీవ్ర గాయాలపాలైన సంఘటన సోమవారం స్థానిక వడ్లమూరు రోడ్డులో చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. గోరింట గ్రామానికి చెందిన బొంతు చిన్న ఆటోపై వస్తుండగా అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో చిన్నకు తీవ్ర గాయాలు కాగా స్థానికులు కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై ఎస్‌ఐ సురేష్‌ను వివరణ కోరగా తమకు ఎటువంటి ఫిర్యాదు అందలేదన్నారు.

మద్యం మత్తులో ప్రమాదానికి గురైన యువకుడు



గాయాల పాలైన యువకుడికి ప్రథమ చికిత్స చేస్తున్న హైవే అంబులెన్సు సిబ్బంది

పిఠాపురం: మద్యం మత్తులో వాహనాన్ని నడుపుతూ అదుపుతప్పి పడిపోవడంతో ఒక యువకుడికి గాయాలయ్యాయని గొల్లప్రోలు హైవే పోలీసులు తెలిపారు. వారు తెలిపిన వివరాల ప్రకారం సోమవారం కత్తిపూడి నుంచి మోటారు సైకిల్‌పై పిఠాపురం వైపు వస్తున్న ఒక యువకుడు మద్యం మత్తులో గొల్లప్రోలు టోల్‌ప్లాజా వద్ద అదుపుతప్పి కింద పడిపోయాడు. దీంతో గాయాలపాలైన అతడిని హైవే అంబులెన్సులో పిఠాపురం ప్రభుత్వాసుపత్రికి తరలించగా చికిత్స పొందుతున్నాడు. యువకుడు ఎవరనేది వివరాలు తెలియాల్సి ఉంది. గొల్లప్రోలు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పాళమ్మ తల్లి ఆలయ పునర్నిర్మాణం పూర్తి



ప్రారంభోత్సవానికి సిద్ధమైన పాళమ్మ తల్లి ఆలయం

కరప: పెనుగుదురు గ్రామ దేవత పాళమ్మ తల్లి ఆలయ పునర్నిర్మాణ పనులు పూర్తయ్యాయి. ఈ నెల 4న ఉదయం 8.13 గంటలకు రూరల్ ఎమ్మెల్యే కురసాల కన్నబాబు, శ్రీవిద్య దంపతుల చేతుల మీదుగా అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ జరిపేందుకు సర్పంచ్ రెడ్డిపల్లి వెంకటమాధవి, ఎంపీటీసీ సభ్యురాలు బండారు సుజాత ఆధ్వర్యంలో గ్రామస్తులు ఏర్పాట్లు చేస్తున్నారు. గ్రామస్తులు తమ ఇలవేల్పుగా కొలిచే పాళమ్మ తల్లి ఆలయం శిథిలావస్థకు చేరడంతో ప్రజల వినతి మేరకు ఎమ్మెల్యే కన్నబాబు స్పందించి ఆలయ పునర్నిర్మాణానికి రూ.35 లక్షలు మంజూరు చేయించారు. పది నెలల కిందట భూమిపూజ చేశారు. ఈ పనులు పూర్తి కావడంతో అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠకు ఏర్పాట్లు చేశారు. మంగళవారం ఎమ్మెల్యే కన్నబాబు, శ్రీవిద్య దంపతులు, సర్పంచ్ వెంకటమాధవి, రమేష్, ఎంపీటీసీ సభ్యులు సుజాత, వెంకటేశ్వరరావు దంపతులు తదితర గ్రామస్తులతో కలసి హోమం, పూజలు నిర్వహిస్తారు. ఈ పూజాదికాలను కోనసీమ వాస్తవ్యులు బ్రహ్మశ్రీ ఉపద్రష్ట లక్ష్మీనరసింహశాస్త్రి ఆధ్వర్యంలో పండితులు 2, 3 తేదీల్లో నిర్వహిస్తారు. 4న అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవం జరుగుతుంది.



పెద్దాపురంలో పోలీసుల మధ్య కేక్ కట్ చేస్తున్న దవులూరి దొరబాబు



పెద్దాపురం ఆర్డీఓ కార్యాలయం వద్ద సంబరాల్లో ఆర్డీఓ రామారావు



పులిమేరు శాంతివర్ధనలో నూతన సంవత్సర వేడుకల్లో వీరబాబు, సత్య దంపతులు



సామర్లకోట మున్సిపల్ చైర్‌పర్సన్‌కు శుభాకాంక్షలు తెలిపిన మెప్మా సిబ్బంది

కొత్త ఆశలు.. కొంగొత్త లక్ష్యాలు

- నూతన వత్సరానికి ఉత్సాహంగా స్వాగతం
- ఆనందోత్సాహాల్లో యువత

సామర్లకోట: సరికొత్త ఆశలు.. కొంగొత్త లక్ష్యాలతో నూతన సంవత్సరానికి ఆహ్వానం పలుకుతూ జరిగిన వేడుకలు అంబరాన్నంటాయి.. కేక్‌లు కట్ చేసి సంబరాలు జరుపుకొన్నారు.. యువత ఆనందోత్సాహాల్లో మునిగితేలారు. సామర్లకోట వైఎస్సార్ సీపీ క్యాంప్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన వేడుకల్లో రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్, పెద్దాపురం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ కోఆర్డినేటర్ దవులూరి దొరబాబుకు శుభాకాంక్షలు తెలియజేయడానికి పార్టీ శ్రేణులు, అధికారులు అధిక సంఖ్యలో వచ్చారు. దేవదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ పులి నారాయణమూర్తి ఆధ్వర్యంలో దవులూరి దొరబాబుకు శృంగార వల్లభస్వామి ఆలయ పండితులు ఆశీర్వచనాలు అందజేశారు. అయ్యారక కార్పొరేషన్ రాష్ట్ర చైర్‌పర్సన్ ఆవాల రాజేశ్వరీ, మున్సిపల్ చైర్‌పర్సన్లు గంగిరెడ్డి అరుణ, బొడ్డు తులసీమంగతాయారు, ఎంపీపీలు బొబ్బరాడ సత్తిబాబు, పి.సత్యవతి, జెడ్పీటీసీ సభ్యులు ఎలిశెట్టి అమృత, గవరసాని సూరిబాబు, మున్సిపల్ వైస్ చైర్మన్లు ఉబా జాన్‌మోజెస్, నెక్కంటి సాయిప్రసాద్, పెద్దాపురం ఆర్డీఓ జె.సీతారామారావు, పెద్దాపురం, సామర్లకోట సీఐలు, ఎస్సైలు, ఎంపీడీఓ డి.శ్రీలలిత, మున్సిపల్ కమిషనర్ జె.రామారావు, తహసీల్దార్‌లు ఎస్ఎల్‌వీ కుమారి, వజ్రపు జితేంద్ర, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శులు ఆవాల లక్ష్మీనారాయణ, కంటే వీర్రాఘవరావు, క్రిస్టియన్ మైనార్టీ సెల్ రాష్ట్ర కార్యదర్శి మడికి పోనియా, మండల పార్టీ అధ్యక్షుడు తాటికొండ అచ్చిరాజు పాల్గొని దొరబాబుకు శుభాకాంక్షలు తెలిపారు. నూతన సంవత్సరానికి స్వాగతం చెబుతూ అభిమానుల మధ్య కేక్ చేశారు. ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప అచ్చంపేటలో, జనసేన కోఆర్డినేటర్ తుమ్మల బాబు పెద్దాపురంలో నూతన సంవత్సర వేడుకల్లో పాల్గొన్నారు. వివిధ పార్టీలకు చెందిన నాయకులు, అభిమానులు భారత మాత సేవా పరిషత్తు అధ్యక్షుడు గోరకపూడి చిన్నయ్యదొరకు శుభాకాంక్షలు తెలిపారు. మున్సిపల్ చైర్‌పర్సన్ గంగిరెడ్డి అరుణ, వైస్ చైర్మన్ ఉబా జాన్‌మోజెస్, మున్సిపల్ కోఆప్షన్ సభ్యుడు దవులూరి సుబ్బారావు, మున్సిపల్ కమిషనర్ జె.రామారావులు వారి స్వగృహంలో, ఎంపీడీఓ, తహసీల్దార్‌లు వారి కార్యాలయాల్లో వేడుకలు జరుపుకొన్నారు.



దొరబాబును సత్కరిస్తున్న అయ్యారక కార్పొరేషన్ చైర్‌పర్సన్ ఆవాల రాజేశ్వరి, రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీనారాయణ

అందరిపై క్రీస్తు ఆశీస్సులు

పెద్దాపురం: ఏసుక్రీస్తు ఆశీస్సులు అందరిపై ఉంటాయని క్రీస్తు శాంతి ప్రార్థనా మందిరం వ్యవస్థాపకుడు నంగిన సత్యానందం అన్నారు. క్రీస్తు ఆరాధనల్లో భాగంగా కొత్త సంవత్సరాన్ని స్వాగతిస్తూ నిర్వహించిన ప్రేమవిందులో ఆయన ప్రసంగించారు. క్రిస్టియన్ గాస్పల్ మినిస్ట్రీస్ (సీజీఎం) అధ్యక్షుడు నంగిన శామ్యూల్ సుదీప్ అధ్యక్షతన జరిగిన సభలో సత్యానందం మాట్లాడుతూ క్రీస్తు ఆశీస్సులు ప్రతి ఒక్కరిపై ఉండాలన్నారు. అనంతరం సుమారు 1,500 మందికి ప్రేమవిందు ఏర్పాటు చేశారు. దైవజనులు అభిషేక్, పాస్టర్‌లు నంగిన శాంతకుమారి, నంగిన ప్రేమలత, విశాల, మేరీ, శాంతివర్ధన విభిన్న ప్రతిభాంతుల పాఠశాల డైరెక్టర్ రాయవరపు వీరబాబు, బొందల త్రిమూర్తులు పాల్గొన్నారు. పులిమేరు శాంతివర్ధన విభిన్న ప్రతిభావంతుల పాఠశాలలో కొత్త సంవత్సర వేడుకలు నిర్వహించారు. పాఠశాల డైరెక్టర్ రాయవరపు వీరబాబు, సత్య దంపతులు విభిన్న ప్రతిభావంతులతో కేక్ కట్ చేయించారు. స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో ఆర్డీఓ జేఎస్ రామారావు కేక్ కట్ చేయగా రెవెన్యూ సిబ్బంది ఆయనకు గ్రీటింగ్స్ తెలిపారు. ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ అశోక్‌కుమార్, ఈఓపీఆర్డీ రాజశేఖర్‌లకు, వ్యవసాయ శాఖ కార్యాలయంలో ఏడీఏ దైవకుమార్, మున్సిపాలిటీ పరిధిలో వైస్ చైర్మన్ నెక్కంటి సాయిప్రసాద్ వేడుకల్లో పాల్గొన్నారు. ఏపీ ఎన్జీఓ కార్యాలయంలో ఎన్జీఓ అధ్యక్షుడు డీడీ సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో వేడుకలు జరిపారు.

ఘనంగా నూతన సంవత్సర వేడుకలు



కోనపాపపేటలో ఎంపీపీ కారే సుధకు శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు



ఉప్పాడలోని ప్రార్థనా మందిరంలో మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్న దృశ్యం

- కేరింతలు కొట్టిన యువత
- చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు

కొత్తపల్లి: పల్లె, పట్టణమన్న తేడా లేకుండా ప్రజలంతా నూతన సంవత్సర వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించుకున్నారు. ప్రధానంగా యువత ఆదివారం అర్ధరాత్రి నుంచి వేడుకల్లో మునిగితేలారు. కేక్‌లను కట్ చేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుకున్నారు. చిన్నారులు, విద్యార్థులు తమ స్నేహితులకు గ్రీటింగ్‌లు, చాక్లెట్‌లను పంచి సందడి చేశారు. నూతన సంవత్సరం సందర్భంగా మండలంలోని పలు క్రీస్తు ప్రార్థనా మందిరాల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. విద్యార్థులకు వివిధ పోటీలను నిర్వహించి బహుమతులను అందజేశారు. ఉప్పాడ ఎస్సీపేటలో ఉన్న హోసన్న సియోన్ ప్రార్థనా మందిరంలో సోమవారం క్రిస్మస్, నూతన సంవత్సర వేడుకల్లో భాగంగా చర్చి పాస్టర్ ఎంజీ రాయ్ చేతుల మీదుగా వృద్ధులకు దుప్పట్లను పంపిణీ చేశారు.

నేతల ఇళ్ల వద్ద సందడి

కోనపాపపేటలో ఎంపీపీ కారే సుధ, మండల కోఆప్షన్ సభ్యుడు కారే శ్రీనివాస్ స్వగృహంలో నూతన సంవత్సర వేడుకలను నిర్వహించారు. వాకతిప్పలో మండల పార్టీ అధ్యక్షుడు ఆనాల సుదర్శన్ ఆధ్వర్యంలో నూతన సంవత్సర వేడుకలు జరిగాయి. వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి రావు చిన్నారావు తన కార్యాలయంలో నూతన సంవత్సర వేడుకలు నిర్వహించారు. కొత్తపల్లిలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర యువజన విభాగ ప్రధాన కార్యదర్శి మాదిరెడ్డి దొరబాబు స్వగృహం వద్ద వేడుకలు జరిగాయి.

గ్రామాల్లో సం'క్రాంతి'



దూడూ బసవన్నల సందడి

- ఇంటింటా కళకళలాడుతున్న రంగవల్లులు
- అలరిస్తున్న హరిదాసు కీర్తనలు
- కనువిందు చేస్తున్న దూడూ బసవన్నల విన్యాసాలు

పిఠాపురం: గ్రామాలు సంక్రాంతి శోభతో కళకళలాడుతున్నాయి. పిఠాపురం, పెద్దాపురం నియోజకవర్గాల్లోని గ్రామీణ ప్రాంతాల్లో పండగ సందడి నెలకొంది. దూడూ బసవన్నల విన్యాసాలు, భోగిమంటల కోసం బుడతల పాట్లు, హరిదాసు కీర్తనలతో తెలుగింటి సంప్రదాయాలు కనువిందు చేస్తున్నాయి. వీధుల్లో అతివలు రోజూ రంగవల్లులు వేసి గొబ్బెమ్మలతో అలంకరిస్తున్నారు. రైతుల ఇంట ధాన్యలక్ష్మి ప్రవేశించడంతో పాటు ఆదాయం చేతికందడంతో సున్నుండలు, అరిసెలు, పొంగడాలు, బొబ్బట్లు, గారెలు వంటి పిండివంటలు నోరూరిస్తున్నాయి. కొమ్మదాసరులు, పగటి వేషగాళ్లు తదితర కళాకారులు సంస్కృతీ సంప్రదాయాలకు ప్రతీకలుగా గ్రామాల్లో తిరుగుతూ తమ కళలు ప్రదర్శిస్తున్నారు.



ప్రత్యేక అలంకరణలో కుంతీ మాధవస్వామి

వైభవంగా ధనుర్మాస ఉత్సవాలు

పిఠాపురంలో ప్రాచీన దేవాలయమైన కుంతీ మాధవస్వామివారి ఆలయంలో ధనుర్మాసోత్సవాలు అత్యంత ఘనంగా నిర్వహిస్తున్నారు. గత 16 రోజుల నుంచి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చనలు, కల్యాణాలు నిర్వహిస్తున్నారు. ప్రముఖ ఆలయాలతో పాటు గ్రామాల్లోని అన్ని వైష్ణవ ఆలయాలు, శైవ ఆలయాల్లోనూ ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి.

కళకళలాడుతున్న వ్యాపార సంస్థలు

పంటలు చేతికందాయి. పండగ సమయం దగ్గరపడింది. ఇంకేముంది పిండివంటలతో పాటు నూతన వస్త్రాలు, నగలు కొనుగోళ్లతో వ్యాపార సంస్థలు కళకళలాడుతున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో గృహాలు కొత్త రంగులతో నూతన శోభను సంతరించుకున్నాయి.

ఆధ్యాత్మిక వైభవం.. ఆనంద పరవశం



గాంధీనగర్ వేంకటేశ్వరస్వామి ఆలయంలో దర్శనం కోసం క్యూ కట్టిన భక్తులు



సముద్ర జలాల పూర్ణకుంభానికి విష్ణు హారతి ఇస్తున్న శ్రీవారి భక్తులు



కృష్ణావతారంలో దర్శనమిచ్చిన సీతారామస్వామి

బోట్‌క్లబ్: కొత్త సంవత్సరం వేళ ఆధ్యాత్మికత వెల్లివిరిసింది. సోమవారం నగరంలోని పలు ఆలయాలకు భక్తులు పోటెత్తారు. ధనుర్మాసం సందర్భంగా నగరంలోని విష్ణాలయాలతో పాటు వేంకటేశ్వరస్వామి ఆలయాల్లో ఉదయం నుంచి మధ్యాహ్నం వరకూ రద్దీ నెలకొంది. దర్శనం కోసం గంటల తరబడి క్యూ లైన్‌లో నిలబడాల్సి వచ్చింది. స్థానిక జగన్నాథపురం వేంకటేశ్వరస్వామి ఆలయానికి తెల్లవారు జాము నుంచే భక్తులు పోటెత్తారు. గాంధీనగర్ వేంకటేశ్వరస్వామి, వెంకట్‌నగర్ వేంకటేశ్వరస్వామి ఆలయాలు, మెయిన్‌రోడ్డు సీతారామస్వామి, దేవాలయం వీధిలోని రుక్మిణీ సత్యభామా సమేత వేణుగోపాలస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు జరిగాయి. స్వయం భూ భోగి గణపతి పీఠంలో

ఆలయాలకు పోటెత్తిన భక్తులు

సముద్ర జలాల పూర్ణ కుంభానికి ప్రత్యేక పూజలు నిర్వహించి ధూపదీప నైవేద్యాలతో శ్రీమహావిష్ణు హారతి ఇచ్చారు. తొలుత గణపతికి 813వ జప యజ్ఞ పారాయణ పూర్తి చేసి, సామూహిక విష్ణు సహస్ర నామ పఠనం చేశారు. పీఠం వ్యవస్థాపక ఉపాసకుడు దూసర్లపూడి రమణరాజు మాట్లాడుతూ పుణ్య దినోత్సవాల్లో ఏడాదికి ఒకసారి సముద్ర స్నానం చేయడం సముద్రునికి విష్ణు హారతి సమర్పించడం హైందవ సంస్కృతి అన్నారు. తీరానికి వెళ్లలేని పక్షంలో సముద్ర జలాలను పూజా మందిరంలో కుంభంగా నిలిపి విష్ణు ఆరాధనతో ఆ జలాలను శిరస్నానం చేయడం మంగళకరమన్నారు. భారీ సంఖ్యలో శ్రీవారి భక్తులు పాల్గొన్నారు.

కృష్ణావతారంలో సీతారామస్వామి

స్థానిక మెయిన్‌రోడ్డులోని సీతారామస్వామి ఆలయంలో ధనుర్మాస వ్రత మహోత్సవాల్లో భాగంగా స్వామివారు కృష్ణావతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. స్వామివారికి ఆలయ ప్రధాన అర్చకుడు భావవరపు భాస్కరాచార్యులు ఉదయం పంచామృతాభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు.

అంతా కలసిమెలసి సాగుదాం..

బోట్‌క్లబ్: మానవజాతి అంతా పెద్ద కుటుంబమని కాకినాడ ఇండియన్ డెంటల్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ నాగేంద్ర అన్నారు. స్థానిక ఆనంద భారతి వద్ద రవి దంత వైద్యశాలలో అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం ప్రపంచ కుటుంబ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సభ్యులందరికీ మొక్కలు అందజేశారు. డాక్టర్ నాగేంద్ర మాట్లాడుతూ అసోసియేషన్ సభ్యులంతా కుటుంబ సభ్యుల్లా కలసి మెలసి సాగుతామని, ఈ సంవత్సరం సమాజ సంక్షేమ కార్యక్రమాలు చేపడతామన్నారు. డాక్టర్ వీవీ రావు మాట్లాడుతూ ప్రపంచ సంస్కృతులు, మతాలు భిన్నంగా ఉండొచ్చని, కానీ మానవజాతి అంతా ఒక పెద్ద కుటుంబమన్నారు. అందుకే అంతా కలసిమెలసి సాగాలన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు అడ్డాల సత్యనారాయణ, డాక్టర్లు వెంకటపతి, గాయత్రి, స్వరూప్ తదితరులు పాల్గొన్నారు.

వారధి వచ్చే.. అభివృద్ధి మెచ్చే

- రేపు సీఎం చేతుల మీదుగా ప్రారంభం
- ముత్తా వారధితో ట్రాఫిక్ కష్టాలకు చెక్
- రూ.94 కోట్లతో అభివృద్ధి పనులు
- స్కేటింగ్ రింక్‌తో క్రీడా సౌరభం

కాకినాడ: నగరంలో మూడు ప్రధాన అభివృద్ధి కార్యక్రమాలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బుధవారం ప్రారంభించనున్నారు. ట్రాఫిక్ కష్టాలను తీర్చే ముత్తా గోపాలకృష్ణ వారధిని ప్రజలకు అంకితం చేయడంతో పాటు క్రీడాభిమానులకు ప్రయోజనం కలిగేలా నిర్మించిన స్కేటింగ్ రింక్, రాగిరెడ్డి కళాక్షేత్రం కూడా ప్రారంభం కానున్నాయి. సీఎం రాకకు సంబంధించి పర్యటన తేదీ ఖరారు కావడంతో ఆయా పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేస్తున్నారు. రూ.65 కోట్లతో నిర్మించిన ముత్తా గోపాలకృష్ణ వారధి (కొండయ్యపాలెం ఫ్లై ఓవర్) జనవరి మూడో తేదీన సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకు అంకితం చేయనున్నారు. 14 ఏళ్ల క్రితం శంకుస్థాపన చేసిన ఈ ఫ్లై ఓవర్‌కు అడుగడుగునా అవాంతరాలే ఎదురయ్యాయి. న్యాయపరమైన సమస్యలు, గత పాలకుల నిర్లక్ష్యంతో నిర్మాణం నత్తనడకన సాగుతూ వచ్చింది. సీఎం జగన్ అధికారం చేపట్టాక ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి ప్రత్యేక చొరవ తీసుకోవడంతో 14 ఏళ్ల తరువాత ఈ వారధి అందుబాటులోకి రానుంది. భూ సేకరణతో పాటు, నిర్మాణ వ్యయం కలిపి రూ.65 కోట్లు వెచ్చించి దీనిని పూర్తి చేశారు.



ప్రారంభానికి ముస్తాబైన కొండయ్యపాలెం ఆర్వోబీ



సిద్ధమైన స్కేటింగ్ రింక్

రూ.20 కోట్లతో కళాక్షేత్రం

రాజా ట్యాంక్ ఆవరణలో రూ.20 కోట్లు ఖర్చు చేసి అత్యాధునిక వసతులతో రాగిరెడ్డి వెంకట జయరామ్‌కుమార్ కళాక్షేత్రాన్ని నిర్మించారు. సుమారు 770 సీట్ల సామర్థ్యంతో వీక్షించేందుకు వీలుగా సకల సౌకర్యాలతో కళాక్షేత్రం నిర్మితమైంది. చక్కటి వేదిక, ఏసీ, లైటింగ్, సౌండ్ సిస్టమ్‌లను కూడా ఇందులో ఏర్పాటు చేశారు. సాంస్కృతిక కార్యక్రమాలు, సభలు, సమావేశాల నిర్వహణకు ఇది ఎంతో ఉపయోగంగా ఉంటుంది.

రూ.9 కోట్లతో స్కేటింగ్ రింక్

ఇక రాజా ట్యాంక్ ఆవరణలో అంతర్జాతీయ ప్రమాణాలతో స్కేటింగ్ రింక్ నిర్మించారు. చక్కటి వసతులు, నాణ్యతా ప్రమాణాలతో ఇక్కడ ట్రాక్ నిర్మించారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పోటీలు నిర్వహించేందుకు దీనిని తీర్చిదిద్దారు. ఈ ప్రాంతం నుంచి ఎంతో మంది ప్రతిభ కలిగిన స్కేటింగ్ క్రీడాకారులు ఉన్న నేపథ్యంలో ఇక్కడ నిర్మిస్తున్న స్కేటింగ్ రింక్ ఈ ప్రాంతానికి ఎంతో ప్రయోజనకరంగా ఉండనుంది.



రాగిరెడ్డి కళాక్షేత్రం

> **సీఎంతో ప్రారంభోత్సవం**
>
> కళాక్షేత్రం, స్కేటింగ్ రింక్, ఆర్వోబీలను సీఎం జగన్ ప్రారంభించనున్నారు. ముత్తా గోపాలకృష్ణ వారధి ఈ ప్రాంత ప్రజలకు ఎంతో సౌకర్యంగా ఉంటుంది. నగరంలో అభివృద్ధి పనులకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నాం. ఎప్పటికప్పుడు సమస్యలు పరిష్కరిస్తున్నాం.
>
> – ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి, ఎమ్మెల్యే, కాకినాడ సిటీ

రోడ్ షో విజయవంతం చేయాలి



సమీక్షలో మాట్లాడుతున్న కమిషనర్ నాగనరసింహారావు

కాకినాడ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ నెల 3న నిర్వహించనున్న రోడ్ షోను విజయవంతం చేసేందుకు అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్ సీహెచ్ నాగ నరసింహారావు సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం స్థానిక స్మార్ట్ సిటీ కార్యాలయంలో జిల్లా స్థాయి, కార్పొరేషన్ ప్రత్యేక అధికారులు, ఆర్పీలతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హెలిప్యాడ్ నుంచి సభాస్థలి వరకూ ఏర్పాటు చేసిన రోడ్ షో విజయవంతానికి ఆయా శాఖల అధికారులు పటిష్టవంతమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇందుకు సంబంధించి బాధ్యతలు నిర్వర్తిస్తున్న అధికారులు, సిబ్బంది ఈ అంశంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కోరారు. సుమారు 750 మీటర్ల పరిధిలో జరిగే ఈ రోడ్ షోలో వివిధ సంక్షేమ పథకాల లబ్ధిదారులు పాల్గొనేలా చూడాలన్నారు. సమావేశంలో నగరపాలక సంస్థ కార్యదర్శి ఎం.ఏసుబాబు, డిప్యూటీ కమిషనర్ కోన శ్రీనివాస్, ఎంహెచ్ఓ డాక్టర్ పృథ్వీచరణ్, మెప్మా పీడీ ప్రియంవద, టీపీఆర్వో మానే కృష్ణమోహన్, సిటీ మిషన్ మేనేజర్ దేగల వెంకటరాజు, జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.